సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




గురువారం 23 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 325 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## ధరిత్రి దినోత్సవం, పర్యావరణ పరిరక్షణపై సీఎం రేవంత్ రెడ్డి సందేశం – ఉగ్రదాడులపై నివాళి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రతినిధి: ధరిత్రి దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతపై కీలక సందేశం విడుదల చేశారు. జీవరాశి మనుగడకు ఆధారమైన భూమిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కాలుష్యరహిత సమాజం కోసం ప్రజలంతా తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కాలుష్య నియంత్రణకు అనేక చర్యలు చేపట్టిందని, 2034 నాటికి హైదరాబాద్‌ను నెట్ జీరో సిటీగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని వివరించారు. కాలుష్య కారక పరిశ్రమలను నగర పరిధి బయటకు తరలించడం, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని పెంచడం, హరిత వనాల విస్తరణ, చెరువుల పరిరక్షణ, మూసీ నది పునరుద్ధరణ, రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే పర్యావరణ సుస్థిరత కోసం రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి గ్రీన్ స్ట్రాటజీ అమలు చేయనున్నట్లు చెప్పారు. "భూమిని ప్రేమిద్దాం - ప్రకృతిని సంరక్షిద్దాం - మన భవిష్యత్తును కాపాడుకుందాం" అని సీఎం పిలుపునిచ్చారు. ఇదే సందర్భంగా పహల్గామ్ ఉగ్రదాడి ఘటనను స్మరించుకుంటూ, ఆ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు ఆయన ఘన నివాళులు అర్పించారు. అలాంటి ఉగ్రదాడులు దేశ ఐక్యతను దెబ్బతీయలేవని, దేశ ప్రజలు ఐక్యంగా, ధైర్యంగా ఎదుర్కొని వాటిని తిప్పికొడతారని ఆయన స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## ఇల్లెందు ప్రగతికి 'బంగారు' బాట – రూ.50 కోట్లతో పట్టణ అభివృద్ధి వేగవంతం

సందేశం టైమ్స్, ఏప్రిల్ 23, ప్రతినిధి: ఇల్లెందు మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఇల్లెందు పట్టణంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం మొత్తం రూ.50 కోట్ల నిధులను రెండు విడతల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అక్షరాలా అమలు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. పట్టణంలోని వార్డుల వారీగా ఉన్న సమస్యలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు ఉదయం, సాయంత్రం ప్రజలకు అందుబాటులో ఉంటేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని ఆయన సూచించారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ 24 వార్డుల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మిల గృహప్రవేశ వేడుకల్లో మంత్రి స్వయంగా పాల్గొని గృహాలను ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీవో మధు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పెట్టుబడుల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష – కంపెనీలు వెంటనే కార్యకలాపాలు ప్రారంభించాలి



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రతినిధి: రాష్ట్రంలో వివిధ వేదికలపై తెలంగాణ ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్న కంపెనీలు, సంస్థలు తక్షణమే తమ కార్యకలాపాలు ప్రారంభించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల అమలుకు సంబంధించి కంపెనీలకు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎటువంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. దావోస్‌తో పాటు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో కుదిరిన ఎంవోయూల అమలు పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తదితరులతో కలిసి వివరంగా చర్చించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించి, పేరుప్రఖ్యాతులు ఉన్న పెద్ద సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇప్పటివరకు గ్రౌండ్ అయిన ప్రాజెక్టులు, పెండింగ్‌లో ఉన్న అంశాలు, భూసేకరణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. భారత్ ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు భూముల కేటాయింపు వేగవంతం చేయాలని చెప్పారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్‌టీపీల ద్వారా శుద్ధి చేసి వినియోగించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో పనులు త్వరగా పూర్తిచేసి అక్కడే ఎంవోయూల అమలు, పురోగతిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అలాగే పూర్తయిన కంపెనీలను త్వరగా ప్రారంభోత్సవానికి తీసుకురావాలని సూచించారు. ఎంవోయూలు ఎప్పుడు కుదిరాయి, ఏ స్థితిలో ఉన్నాయి, పెట్టుబడుల విలువ, ఉద్యోగ అవకాశాలు వంటి పూర్తి వివరాలతో రియల్ టైమ్ డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని, దీనిని సీనియర్ ఐఏఎస్ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. టైర్-2, టైర్-3 నగరాల్లో ఐటీ టవర్ల పనితీరుపై కూడా సమీక్ష నిర్వహించి, జైకా నిధులతో జరుగుతున్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఆదేశించారు.











## రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులకు డీజీపీ ర్యాంకు హోదా – ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సందేశం టైమ్స్, ఏప్రిల్ 23, ప్రతినిధి: రాష్ట్ర పోలీస్ శాఖలో కీలక నిర్ణయం తీసుకుంటూ 1995 మరియు 1996 బ్యాచ్‌లకు చెందిన పలువురు ఐపీఎస్ అధికారులకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ర్యాంకు హోదా కల్పిస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘ కాలంగా వివిధ జిల్లాల్లో, రాష్ట్ర స్థాయి విభాగాల్లో సేవలందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ఇంటెలిజెన్స్ వ్యవస్థ బలోపేతం, సైబర్ క్రైమ్ దర్యాప్తు వంటి కీలక రంగాల్లో విశేష సేవలు అందించిన ఈ అధికారులు తమ అనుభవం, సమర్థత ఆధారంగా ఈ ఉన్నత హోదాకు అర్హులయ్యారని ప్రభుత్వం పేర్కొంది. పదోన్నతుల ద్వారా వీరికి ఇకపై మరింత విస్తృతమైన పరిపాలనా బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో విధాన నిర్ణయాలు తీసుకోవడం, ముఖ్య ఆపరేషన్ల పర్యవేక్షణ, కీలక విభాగాల సమన్వయం వంటి అంశాల్లో వీరి పాత్ర మరింత కీలకంగా మారనుంది. ఈ ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో పోలీస్ శాఖలో సంతోష వాతావరణం నెలకొంది. సహోద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలుపుతూ, వారి నాయకత్వంలో రాష్ట్ర పోలీస్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అఖండ గోదావరి మహా పుష్కరాలు–2027' ఘనంగా నిర్వహణకు కూటమి ప్రభుత్వం చర్యలు

సందేశం టైమ్స్, ఏప్రిల్ 23, ప్రతినిధి: 2027లో జరగనున్న 'అఖండ గోదావరి మహా పుష్కరాలు'ను ఘనంగా నిర్వహించే దిశగా కూటమి ప్రభుత్వం విస్తృత స్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టింది. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ వివిధ శాఖలకు అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ప్రధానంగా విద్యుత్ శాఖకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ పుష్కరాల ఏర్పాట్ల కోసం రూ.150 కోట్లను కేటాయించగా, ఒక్క విద్యుత్ శాఖలోనే మొత్తం రూ.485 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. పుష్కర ఘాట్ల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా, లైటింగ్, భద్రతా వ్యవస్థలు, అత్యవసర సేవల కోసం ఆధునిక ఏర్పాట్లు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే పలు విభాగాల పనులను పుష్కరాలకు కనీసం రెండు నెలల ముందే పూర్తి చేసేలా ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రవాణా, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలు వంటి అన్ని రంగాల్లో సమన్వయంతో పని చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

## ఏపీలో లేబర్ కార్డుదారులకు భారీ శుభవార్త నాలుగు కొత్త సంక్షేమ పథకాలు ప్రారంభం

సందేశం టైమ్స్, ఏప్రిల్ 23, ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో లేబర్ కార్డు కలిగిన కార్మికులకు ప్రభుత్వం భారీ శుభవార్త ప్రకటించింది. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నాలుగు కొత్త పథకాలను ప్రారంభించినట్లు అధికారికంగా వెల్లడించింది. ఈ పథకాల ప్రకారం పెళ్లి చేసుకునే లబ్ధిదారులకు "పెళ్లి కానుక"గా రూ.50,000 ఆర్థిక సహాయం అందించనున్నారు. అలాగే గర్భిణీలకు ప్రసవ సమయంలో సహాయంగా "ప్రసవ కానుక" కింద రూ.20,000 ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కార్మిక కుటుంబాల్లో అనుకోని మరణాలు సంభవించినప్పుడు "మరణ సహాయం" కింద గరిష్టంగా రూ.5 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. అంత్యక్రియల ఖర్చుల కోసం అదనంగా రూ.5,000 సహాయం కూడా ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. కార్మికుల జీవన భద్రతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పథకాలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది మంది కార్మిక కుటుంబాలకు ఆర్థిక భద్రత మరింత పెరుగుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## నారాయణఖేడ్‌లో ఆర్టీసీ కార్మికుల సమ్మె – బస్సులు బంద్, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 23, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టడంతో బుధవారం బస్సు సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. సంగారెడ్డి, జోగిపేట్, హైదరాబాద్ మార్గాల్లో టీజీఎస్ ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తో మంగళవారం జరిగిన చర్చలు విఫలమవడంతో అర్ధరాత్రి నుంచే సమ్మె ప్రారంభమైంది. ఆర్టీసీ జేఏసీ పిలుపుతో కార్మికులు బస్సులను డిపోలకే పరిమితం చేశారు. నారాయణఖేడ్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బస్సులు పూర్తిగా నిలిచిపోయాయి. తెల్లవారుజాము నుంచే కార్మికులు డిపో వద్ద బంద్ నిర్వహించగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తుగా మోహరించారు. బస్సులు నడవకపోవడంతో నారాయణఖేడ్ బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ ప్రయాణికులు రవాణా లేక అవస్థలు పడుతున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 32 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగినట్లు తెలిపారు.

## ఝరాసంగం మండలంలో చట్టాలపై అవగాహన సదస్సు




సందేశం టైమ్స్, ఝరాసంగం, ఏప్రిల్ 23, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన చట్టాలపై అవగాహన సదస్సు గ్రామస్థాయిలో పనిచేసే అధికారులకు, సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ఈ సమావేశానికి సంగారెడ్డి జిల్లా డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై వివిధ చట్టాల ప్రాముఖ్యతను విస్తృతంగా వివరించారు. ముఖ్యంగా చైల్డ్ లేబర్ నిషేధ చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో చట్టం వంటి అంశాలపై సవివరంగా అవగాహన కల్పిస్తూ గ్రామస్థాయిలో ఇవి ఎలా అమలు చేయాలి, ఎలాంటి పరిస్థితుల్లో అధికారులకు సమాచారం అందించాలి అనే విషయాలను స్పష్టంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో చిన్నారుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మికత్వం మరియు బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన గ్రామ సెక్రటరీలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు చట్టాలపై తమ సందేహాలను వ్యక్తం చేయగా, వాటికి సమగ్ర సమాధానాలు ఇవ్వడం జరిగింది. యువతకు ఉపయోగపడే చట్టాలపై ప్రత్యేకంగా చర్చ నిర్వహించి, వాటి అమలు ద్వారా సమాజంలో చట్టబద్ధమైన అవగాహన పెంపొందుతుందని వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై క్రాంతి కుమార్ పటేల్ మాట్లాడుతూ చట్టాల అమలులో పోలీసుల పాత్రను వివరించగా, ఎంపీడీవో, ఎంపీవో, సీడీపీఓలు తమ తమ శాఖల పరిధిలో చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సదస్సు ద్వారా గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బంది చట్టాలపై స్పష్టమైన అవగాహన పొందడంతో పాటు, సమాజంలో చట్టాల అమలుకు మరింత కట్టుబడి పనిచేయాలని సంకల్పించారు.

## హైదరాబాద్‌లో మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రతినిధి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో గత కొన్ని రోజులుగా నగరంలోని ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1984లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు అమెరికాకు హార్ట్ సర్జరీ కోసం వెళ్లిన సమయంలో భాస్కరరావు నెలరోజుల పాటు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన ప్రభుత్వం కూలిపోయింది. రాష్ట్ర రాజకీయ చరిత్రలో అతి తక్కువ కాలం ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజాసేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత, రాజకీయ జీవితంలో ఎదుర్కొన్న పరిణామాలు స్మరించుకుంటూ పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## బోరంచలో నల్ల పోచమ్మ అమ్మవారి 7 వారాల మహా జాతర ప్రారంభం రేపటి నుంచి



సందేశం టైమ్స్, మనూర్ మండలం, ఏప్రిల్ 23, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా మనూర్ మండలంలోని బోరంచ గ్రామంలో మంజీరా నది ఒడ్డున వెలసిన శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించనున్న 7 వారాల మహా జాతరకు ఆలయం శోభాయమానంగా ముస్తాబు అయింది. రేపు అనగా ఏప్రిల్ 23 గురువారం నుండి మొదటి జాతర ఘనంగా ప్రారంభం కానుండటంతో గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించగా అర్చకులు మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యావాచనం, ధ్వజారోహణం వంటి వైదిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పరిసరాలను శుభ్రపరిచి, అలంకరణలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శివ రుద్రప్ప, క్లార్క్ శివానంద్, ఆలయ చైర్మన్ మల్లయ్య, ప్రధాన అర్చకులు సిద్ధయ్య స్వామి, ఆలయ సిబ్బంది, పుల్లారెడ్డి, భక్తులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జాతర సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. 7 వారాల పాటు కొనసాగే ఈ మహా జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని, ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించాలని ఆలయ అధికారులు ఆకాంక్షించారు.



## సంగారెడ్డి జిల్లాకు నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా చైతన్య రెడ్డి బాధ్యతలు స్వీకరణ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 23, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నూతన అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఐపిఎస్ అధికారి చైతన్య రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 2022 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ అధికారి అయిన చైతన్య రెడ్డి గతంలో కామారెడ్డి జిల్లాలో అదనపు ఎస్పీ (అడ్మిన్)గా విధులు నిర్వర్తించి తన సేవల ద్వారా గుర్తింపు పొందారు. ప్రస్తుతం బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వచ్చి కొత్త బాధ్యతలను చేపట్టిన ఆయన జిల్లా పరిపాలనలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కట్టుబడి పనిచేస్తానని, ప్రజల భద్రతే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పోలీసు శాఖతో పాటు ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కట్టుబడి ఉంటానని తెలిపారు.



## శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకళ్యాణోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 23, ప్రతినిధి: మట్టపల్లి మహాక్షేత్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 29 నుండి మే 4 వరకు నిర్వహించనున్న తిరుకళ్యాణ మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని వీసీ హాల్ నుంచి నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ పలు కీలక సూచనలు చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ మహోత్సవాల సందర్భంగా మిషన్ భగీరథ ద్వారా నిరంతర తాగునీటి సరఫరా కల్పించాలని, పోలీసు శాఖ పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని, వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని, ఆర్టీసీ అదనపు బస్సులు నడపాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతర సరఫరా అందించడంతో పాటు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీ పరిసరాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఫైర్ సర్వీసు సిబ్బంది ఫైర్ ఇంజన్ స్టాండ్‌బైలో ఉంచాలని ఆదేశించారు. అలాగే స్నాక్స్ పంపిణీ, క్యూ లైన్లు, పార్కింగ్ వద్ద సీసీ కెమెరాలు, వృద్ధులు మరియు దివ్యాంగులకు ఉచిత రవాణా సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థాన అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లి రావు మాట్లాడుతూ అన్ని శాఖలు సేవా దృక్పథంతో కలిసి పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జడ్పీ సీఈఓ శిరీష, ఆర్డీవో శ్రీనివాసులు, దేవాదాయ శాఖ అధికారులు మరియు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి – కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 23, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వసతి గృహాలను మెరుగైన సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంక్షేమ హాస్టళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, వార్డెన్లు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పని చేసి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. హాస్టళ్లలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, వేసవి సెలవుల సమయంలో అవసరమైన చిన్నపాటి మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. హాస్టళ్ల నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, శుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కిచెన్, స్టోర్ రూమ్‌లలో పరిశుభ్రత పాటించాలని, సమగ్రంగా అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలను సమస్యల రహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఎస్సీ, బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు దయానంద, రాణి, నరసింహులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## తుంగతుర్తి మహిళా సంక్షేమ వసతి గృహం తనిఖీ

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 23, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశాల మేరకు తుంగతుర్తి మహిళా సంక్షేమ వసతి గృహాన్ని పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థుల నివాస సౌకర్యాలు, భోజన నాణ్యత, తాగునీటి సదుపాయాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని స్పష్టంగా ఆదేశించారు. వసతి గృహ పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే అవసరమైన మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయించి విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందేలా కట్టుబడి పనిచేయాలని ఆయన సూచించారు.

## గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 23, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2026–27 విద్యాసంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి తెలిపారు. ఈ నెల 23 నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని గిరిజన విద్యార్థులకు 3వ తరగతిలో 15 సీట్లు, 5వ తరగతిలో 8 సీట్లు, 8వ తరగతిలో 7 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్‌లో ఈ ప్రవేశాలు కల్పించబడనున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ సముదాయం, సంగారెడ్డి వద్ద దరఖాస్తు ఫారాలు పొందవచ్చని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1,50,000 లోపు, మున్సిపాలిటీ పరిధిలో ఉన్నవారి ఆదాయం రూ.2,00,000 లోపు ఉండాలని అర్హతగా పేర్కొన్నారు. దరఖాస్తులతో పాటు మీ సేవ ద్వారా పొందిన కుల, ఆదాయ ధృవపత్రాలు, జనన ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, గత తరగతి బోనాఫైడ్ సర్టిఫికెట్ నకళ్లు మరియు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తప్పనిసరిగా జతపరచాలని తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను మే 7 సాయంత్రం 5 గంటలలోపు మాత్రమే స్వీకరించబడతాయని, అనంతరం మే 14న ఉదయం 11 గంటలకు కలెక్టర్ సముదాయం సంగారెడ్డిలో లాటరీ విధానం ద్వారా విద్యార్థుల ఎంపిక చేపట్టబడుతుందని వెల్లడించారు. అర్హులైన గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

## సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లు, కండక్టర్ల నియామకం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 23, ప్రతినిధి: ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో సంగారెడ్డి డిపోలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్లు, కండక్టర్లను తక్షణం నియమించనున్నట్లు డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. డ్రైవర్ పోస్టుకు కనీసం ఒకటిన్నర సంవత్సరాల హెవీ లైసెన్స్ అనుభవం ఉండి చదవడం, రాయడం తెలిసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. కండక్టర్ పోస్టులకు 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు 21 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గురువారం ఉదయం 5 గంటలకు తమ ఒరిజినల్ ధృవపత్రాలతో సంగారెడ్డి డిపోకు హాజరుకావాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులను వెంటనే విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు. డ్రైవర్లకు రోజుకు రూ.1000 వేతనం, కండక్టర్లకు 8 గంటల పనికి రూ.800 వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు. వెంటనే విధుల్లో చేరే అవకాశం ఉన్నందున అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

## ఖమ్మంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నాకు పిలుపు



సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 23, ప్రతినిధి: రైతు సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంగా రైతు మహాధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ నెల 24న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించి చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వరి, మక్క పంటలు పండిస్తున్న రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతు సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రైతుల పంటలకు సరైన ధరలు, బోనస్, మద్దతు కల్పించాలనే డిమాండ్‌తో ఈ మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా కార్యక్రమాన్ని సమయానికి ప్రారంభించి త్వరగా ముగించేలా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అందరూ కచ్చితంగా ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ వద్దకు చేరుకుని ఐక్యతను చాటాలని కోరారు. ఈ సన్నాహక సమావేశంలో మండల స్థాయి నాయకులు, మాజీ సర్పంచులు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు, వివిధ గ్రామాల రైతులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నగర అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 23, ప్రతినిధి: ఖమ్మం నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని చర్చికాంపౌండ్ మరియు ప్రకాష్ నగర్ ఓవర్ బ్రిడ్జిలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జిల ప్రస్తుత పరిస్థితి, మరమ్మత్తుల అవసరం, ట్రాఫిక్ సౌకర్యాలపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. చర్చికాంపౌండ్ ఓవర్ బ్రిడ్జిపై ప్రయాణించే వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, మధ్యభాగంలో రబ్బరు స్ట్రిప్స్ ఏర్పాటు చేసి వాహనాల ప్రయాణాన్ని సాఫీగా మార్చాలని ఆదేశించారు. బ్రిడ్జిపై ఉన్న గుంతలు, పగుళ్లు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను బలోపేతం చేయాలని తెలిపారు. అలాగే బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన పూల కుండల్లో మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణ కోసం అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించారు. నగర అభివృద్ధి కార్యక్రమాల్లో నాణ్యతతో పాటు సమయపాలనకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని పనులను దశలవారీగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులను నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు: కలెక్టర్ ప్రతిమా సింగ్




సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 23, ప్రతినిధి: ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లాలోని మెదక్ మరియు నర్సాపూర్ బస్ డిపోల నుంచి బస్సులు నడిచేలా చర్యలు తీసుకున్నామని, మెదక్ నుంచి 100, నర్సాపూర్ నుంచి 34 బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా అవసరాన్ని బట్టి కొత్త కండక్టర్లను నియమిస్తున్నామని, గతంలో ఆర్టీసీ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారిని పరిశీలించి వారి సేవలను వినియోగించుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలతో సమన్వయంగా పనిచేస్తూ ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, సంస్థల వాహనాలను కూడా అవసరానికి అనుగుణంగా వినియోగించుకుంటూ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. అత్యవసర అవసరాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 9391942254 నంబర్‌ను అందుబాటులో ఉంచామని, అవసరమైన వారు సంప్రదించాలని సూచించారు. ఇదే సమయంలో ప్రైవేట్ వాహనదారులు అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ప్రజా సంబంధాల అధికారి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## నాగులపల్లి గ్రామానికి చెందిన బీఎస్పీ కార్యకర్త శాంత కుమార్ మృతి



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 23, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం నాగులపల్లి గ్రామానికి చెందిన బహుజన సమాజ్ పార్టీ కార్యకర్త శాంత కుమార్ (35) మరణించడంతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. ఆయన అనేక రాజకీయ ప్రలోభాలకు గురైనా బహుజన సమాజ్ పార్టీ జెండాను విడువకుండా, బాబా సాహెబ్ అంబేద్కర్ చూపిన మార్గాన్ని అనుసరిస్తూ జీవితాంతం కట్టుబడి పనిచేసిన నిబద్ధత గల కార్యకర్తగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయన సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర యూనిట్‌కు చెందిన అప్పాజీపల్లి సురేష్ మాట్లాడుతూ శాంత కుమార్ నిజమైన అంబేద్కర్ ఆశయాల వారసుడని కొనియాడుతూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు మెదక్ జిల్లా బహుజన నాయకులు, అంబేద్కర్ భావజాలాన్ని అనుసరించే ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## పుల్కల్ ఎస్ఐ విశ్వజన్‌కు ఘనంగా పుట్టినరోజు వేడుకలు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 23, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలానికి చెందిన ఎస్ఐ విశ్వజన్ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని ఆయన నివాసంలో సన్నిహితులు, మిత్రులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అతిమెల పీటర్, రేపల్లె నర్సింలు, వట్టేమ్ శ్రీనివాస్, కుసుమ వరుణ్, మన్నే పోచయ్య, మన్నే సోమేశ్వర్ తదితరులు పాల్గొని విశ్వజన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ మరెన్నో పుట్టినరోజులు సంతోషంగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఆనంద వాతావరణంలో ఈ వేడుకలు కొనసాగాయి.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 23, ప్రతినిధి: అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం మండల పరిధిలోని ముప్పారం గ్రామంలో చిలపల్లి నవనీత సాయిబాబకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించగా, వట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి కొప్పుల లక్ష్మి శేషారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రసన్న, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏఈ అక్రమ్, ఎంపీవో గంగాధర్, అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, సర్పంచ్ కవిత విట్టల్ తదితరులు పాల్గొని గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ “ఇందిరమ్మ ఇళ్లు” పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పేదవానికి సొంత ఇంటి కల నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరా గాంధీ ఆశయాలను సాకారం చేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ నిర్మాణానికి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. ఈ పథకం ద్వారా పేదలకు ఆత్మగౌరవంతో కూడిన జీవనం సాధ్యమవుతుందని, సమగ్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బాలకిషన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, విఠల్, ఆంజనేయులు, బేతయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పటాన్చెరు ఐడీఏ రోడ్డు డంపింగ్ యార్డును తలపిస్తోంది – స్థానికుల ఆవేదన



సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 23, టౌన్ రిపోర్టర్: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు ఐడీఏ ఫేజ్-1 కాలనీలోని ప్రధాన రహదారి దుర్భర పరిస్థితికి చేరుకుంది. రోడ్డుపై కుళ్లిన కూరగాయలు, మాంసం వ్యర్థాలు పేరుకుపోవడంతో మొత్తం ప్రాంతం డంపింగ్ యార్డును తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర దుర్వాసన కారణంగా ఆ మార్గంలో ప్రయాణించే పాదచారులు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెత్త పేరుకుపోవడంతో దోమల ఉత్పత్తి పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డును శుభ్రపరచడంతో పాటు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


## ఇంద్రేశం మున్సిపాలిటీలో ఉజ్జీవ మహాసభలు ఘనంగా నిర్వహణ





సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 23, టౌన్ రిపోర్టర్: ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్కే వన్ కాలనీలో గల బెర్షబా చర్చ్ ఆఫ్ గాడ్ సంఘంలో ఉజ్జీవ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలు ఏప్రిల్ 20, 21 తేదీల్లో పాస్టర్ ఇమ్మాన్యుయేల్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని మహాసభలకు ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంద్రేశం మున్సిపాలిటీ కౌన్సిలర్ ధరణి అంతిరెడ్డి, రాజన్న మాజీ అధ్యక్షుడు ఎం. పురంజన్, జి. సంజు, జె. జారప్ప, పాస్టర్ శాలిక్ చాటే తదితరులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు పాస్టర్లు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ మహాసభలు ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించే విధంగా విజయవంతంగా ముగిశాయని నిర్వాహకులు తెలిపారు.

## జగ్గయ్యపేట చెరువు వివాదం – ఫిర్యాదు వచ్చినా స్పందించని అధికారులు, నిర్లక్ష్యంపై విమర్శలు


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ

నుండి
యం. రామ నరసింహారావు, యం.టెక్.
సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్
ప్రత్యేక విభాగం, జగ్గయ్యపేట

వరకు
శ్రీయుత మండల తాసిల్దార్,
జగ్గయ్యపేట మండలం,
జగ్గయ్యపేట వారికి

లేఖ సంఖ్య: ... 69/T/M తేది 17.04.2026.

విషయం :- జలవనరుల శాఖ-మైనర్ ఇరిగేషన్- జగ్గయ్యపేట మండలం - జగ్గయ్యపేట పట్టణం ... చెరువు పై ... అర్జీ ... - వివరములు విచారణ జరిపి, వాస్తవికతను – ఈ కార్యాలయమునకు తెలుపవలసినదిగా కోరుట గురించి.

సూచిక :- 1. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ... 13- 4- 2026.

&&&&&&

... ఈ కార్యములకు తెలుపవలసినదిగా కోరుచుంటిమి.


భవదీయ
17/4/26
సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్,
ప్రత్యేక విభాగం, జగ్గయ్యపేట

సందేశం టైమ్స్, ఎన్టీఆర్ జిల్లా, జగ్గయ్యపేట, ఏప్రిల్ 23, ప్రతినిధి: జగ్గయ్యపేటలో చెరువు ఆక్రమణకు సంబంధించిన ఫిర్యాదు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జలవనరుల శాఖ అధికారులు ప్రాథమిక స్థల పరిశీలన కూడా చేయకుండానే ఫైల్‌ను తహసీల్దార్ కార్యాలయానికి పంపినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ఆస్తుల రక్షణపై అధికారుల నిర్లక్ష్య వైఖరి స్పష్టమవుతోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు భూమి ప్రభుత్వానికి చెందిందా లేక ప్రైవేటు వ్యక్తులదా అనే విషయాన్ని కూడా ముందుగా నిర్ధారించకుండా వ్యవహరించడం పరిపాలనా వైఫల్యంగా భావిస్తున్నారు. సంబంధిత భూ రికార్డులు పరిశీలించిన ఆధారాలు కూడా నివేదికలో లేకపోవడం విమర్శలకు దారితీసింది. అంతేకాకుండా సర్వే నివేదికకు గడువు నిర్దేశించకపోవడంతో ఈ వ్యవహారం మరింత ఆలస్యం అవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు సకాలంలో చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆర్టీసీ జేఏసీ రేపటి సమ్మె కార్యాచరణ ప్రకటించింది రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నాలకు పిలుపు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రతినిధి: రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల జేఏసీ రేపటి సమ్మె కార్యాచరణను అధికారికంగా ప్రకటిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట ఉదయం 5 గంటల నుండి మహాధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. మొదటి రోజు సమ్మెను విజయవంతంగా నిర్వహించిన కార్మికులకు జేఏసీ నాయకత్వం ధన్యవాదాలు తెలిపింది. ప్రభుత్వం, యాజమాన్యం చర్చల పేరుతో కార్మికులను మరియు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని జేఏసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సమస్యలను పరిష్కరించలేమని ఇప్పటికే చేతులెత్తేసిందని వారు పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021 వేతన సవరణను కనీసం 30 శాతం తగ్గకుండా అమలు చేయాలని, హైదరాబాద్‌లో ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను రద్దు చేయాలని, ఉద్యోగులను ఇతర జోన్లకు బదిలీ చేసే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, అలాగే కార్మిక సంఘాలను పునరుద్ధరించి వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ ప్రధానంగా డిమాండ్ చేసింది. ఈ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కు తగ్గబోమని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని జేఏసీ హెచ్చరించింది.

## మెదక్‌లో తాత్కాలిక డ్రైవర్లు – నర్సాపూర్‌లో కండక్టర్ల నియామకానికి ఆహ్వానం



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 23, ప్రతినిధి: టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేపడుతున్నట్లు మెదక్ డిపో మేనేజర్ సురేఖ తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో మెదక్ డిపోలో తాత్కాలిక డ్రైవర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్ పోస్టులకు కనీసం 18 నెలల హెవీ లైసెన్స్ అనుభవం ఉన్న అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గల వారు ఉదయం 5 గంటలకు మెదక్ డిపోలో హాజరై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇదే విధంగా నర్సాపూర్ డిపోలో తాత్కాలిక కండక్టర్ల నియామకానికి కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కండక్టర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తప్పనిసరిగా సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత ధృవపత్రాలతో ఉదయం 5 గంటలకు నర్సాపూర్ డిపో కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర రవాణా సేవలు అందించడం టీజీఎస్ ఆర్టీసీ ప్రధాన లక్ష్యమని డిపో మేనేజర్ సురేఖ స్పష్టం చేశారు.



## నేచర్‌క్యూర్ హాస్పిటల్‌లో రాష్ట్ర ఆయుష్ వైద్య సేవలపై మంత్రి సమీక్ష

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 23, ప్రతినిధి: రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సంప్రదాయ వైద్య సేవలు అందించడంపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సంగారెడ్డిలోని నేచర్‌క్యూర్ హాస్పిటల్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు తదితర ఉన్నతాధికారులు పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా ఆయుష్ రంగంలో జరుగుతున్న సేవలు, సమస్యలు, అభివృద్ధి అవసరాలపై వివరాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్న ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, కాలేజీల పనితీరును సమగ్రంగా పరిశీలించి ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన అమలు చేయాలని సూచించారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానాలకు మరింత ప్రాధాన్యం ఇచ్చి ప్రజల్లో అవగాహన పెంపొందించే విధంగా ఆయుష్ శాఖ పని చేయాలని తెలిపారు. ఆసుపత్రుల్లో ఓపీ, ఐపీ రోగుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట కొత్త డాక్టర్లు, సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. సిద్దిపేట, వికారాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల్లో అన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించి వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. మందుల సరఫరాలో ఎలాంటి లోటు లేకుండా రోగులకు అవసరమైన అన్ని ఔషధాలు నిరంతరం అందుబాటులో ఉండేలా పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది హాజరు విషయంలో కఠిన పర్యవేక్షణ అవసరమని, విధులకు గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సరైన అనుమతులు లేకుండా ఆయుర్వేద, హోమియోపతి పేరుతో నడుస్తున్న క్లినిక్‌లు, ఆసుపత్రులపై రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబును ఆదేశించారు. ప్రజలను తప్పుదారి పట్టిస్తూ అనధికార వైద్య సేవలు అందిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

## హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ సంచలన నిర్ణయం – ఆర్థిక కష్టాల నేపథ్యంలో జీతాల కోత, వాయిదా

సందేశం టైమ్స్, ఏప్రిల్ 23, ప్రతినిధి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడే వరకు ముఖ్యమంత్రి, మంత్రులు మరియు ఎమ్మెల్యేల జీతాలను వచ్చే ఆరు నెలల పాటు వాయిదా వేయాలని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ప్రకారం ముఖ్యమంత్రి తన జీతంలో 50 శాతం మాత్రమే తీసుకోవాలని, మంత్రులు మరియు ఎమ్మెల్యేలు 30 శాతం జీతాన్ని తాత్కాలికంగా వదులుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. అలాగే రాష్ట్ర ఉన్నతాధికారులైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల జీతాల్లో కూడా కోత విధించనున్నట్లు తెలిపింది. అయితే తక్కువ వేతనం పొందుతున్న క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగులను ఈ నిర్ణయం నుండి పూర్తిగా మినహాయించి వారికి పూర్తి జీతాలు చెల్లించనున్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్రంపై సుమారు 80 వేల కోట్ల రూపాయల అప్పుల భారముండటం, కేంద్రం నుంచి వచ్చే నిధులు తగ్గడం, అలాగే పాత పెన్షన్ విధానం అమలు కారణంగా ఖజానాపై అదనపు భారం పడటం వంటి అంశాలు ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా పేర్కొనబడ్డాయి. ఆర్థిక క్రమశిక్షణలో భాగంగా ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా జీతాలు తగ్గించుకోవడానికి ముందుకు రావడం దేశంలో తొలిసారిగా హిమాచల్ ప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలిపింది.

## తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో మరో ఎదురుదెబ్బ – టెస్కో ద్వారానే చేనేత కొనుగోళ్లు జరగాలని ఆదేశాలు




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రతినిధి: ప్రభుత్వ సంస్థలకు అవసరమైన దుస్తులు, బెడ్‌షీట్లు తదితర వస్తువులను ప్రైవేట్ సంస్థల ద్వారా సేకరించేందుకు ఈ నెల 2న ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) విడుదల చేసిన నోటిఫికేషన్‌పై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వరంగల్ జిల్లాకు చెందిన వీరాంజనేయ హ్యాండ్లూమ్ వీవర్స్, మ్యాచుపల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, చేనేత పరిశ్రమపై దాదాపు 40 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, గతంలో ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని ప్రభుత్వ కాంట్రాక్టులు వారికే ఇవ్వాలని జీవో జారీ చేసిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రులు తమ చేనేత అవసరాలను తప్పనిసరిగా తెలంగాణ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ (టెస్కో) ద్వారానే సేకరించాలని హైకోర్టు ఆదేశించింది. టెస్కో సరఫరా చేయలేమని ధృవీకరణ పత్రం ఇచ్చిన సందర్భంలో మాత్రమే ఇతర ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు జరుపుకోవచ్చని స్పష్టం చేసింది. పీఎంయూ విడుదల చేసిన నోటిఫికేషన్ చట్టబద్ధంగా నిలవదని కోర్టు తేల్చి చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలినట్లైంది.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.